క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీ హోమం



లలితాపీఠంలో హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితాపీఠంలో బహుళ అష్టమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. పీఠం అర్చకులు, పండితుల వేదమంత్రాల నడుమ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో లలితా దీక్షలు సంక్రాంతి రోజు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నుంచి మాఘ పౌర్ణమి వరకు దీక్షధారులు 21 రోజుల పాటు దీక్షలో ఉంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యులు ఆదిత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

సినిమా బండి చిత్ర ప్రదర్శన రేపు

సీతంపేట: నగరానికి చెందిన వర్ధమాన దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొంది, జాతీయ అవార్డు పొందిన 'సినిమా బండి' తెలుగు చిత్రాన్ని 18వ తేదీ ఉదయం 9:45 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సినిమా ప్రదర్శన అనంతరం దర్శకుడు ప్రవీణ్‌తో ముఖాముఖి, సత్కార కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ఔత్సాహికులు పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రైతుబజారు ఖాళీ



ఖాళీగా ఉన్న రైతుబజారు

సీతమ్మధార: సంక్రాంతి పండగ ప్రభావం రైతుబజార్లపై పడింది. నగరవాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో నగరం చాలావరకు ఖాళీ అయింది. దీంతో కొనుగోలుదారులు లేక సీతమ్మధార రైతుబజారు వెలవెలబోయింది. రైతులు విక్రయాల కోసం తెచ్చిన కూరగాయలు, ఆకుకూరలు మొదలైనవి మిగిలిపోవడంతో, వాటిని వెనుకకు తీసుకువెళ్లాల్సి వచ్చింది.

వ్యర్థాలు తొలగించాలి



షాదీఖానా వద్ద రోడ్డు మధ్యలో ఇలా..

సీతంపేట: రహదారుల మధ్యలో భోగి మంటలు వేశారు. సగం కాలిన దుంగలు, బూడిద అలాగే రోడ్లపై వదిలిపెట్టేశారు. కొన్ని చోట్ల కాలిన దుంగలు, కర్రల్లోంచి మేకులు బూడిదలో చెల్లా చెదురుగా పడి ఉండడంతో, అటుగా వెళ్లే వాహనాలకు మేకులు గుచ్చుకుని పంక్చర్ అయ్యే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల పాటు పారిశుద్ధ్య సిబ్బందికి కూడా సెలవులు కావడంతో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి, వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పరసల కోలాహలం

కంచరపాలెం: పరసల సందడి మొదలైంది. సంక్రాంతి రోజు నుంచి తీర్థాలు ప్రారంభమయ్యాయి. దీంతో పలు ప్రాంతాలు కోలాహలంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో తీర్థాలుగా పిలిచి వీటిని పట్టణాల్లో శ్రీరామలీలా పరసల పేరిట ఏటా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాముగరిడీ, తప్పెటగుళ్లు, కోలాటం వంటి జానపద కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కంచరపాలెం జాషువా కళాప్రాంగణంలో పరస నిర్వహించారు. సోమవారం కనుమ రోజున గవరకంచరపాలెంలో పరస సందడిగా నిర్వహించారు. ముక్కనుమరోజు రామ్మూర్తి పంతుల పేటలో పరసలు జరుగుతాయి. ఎస్ఏడీ, మర్రిపాలెం, కరాసా, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాలలో పరసలు కోలాహలంగా జరుగుతున్నాయి.



ప్రత్యేక పూజల్లో ప్రసన్న వినాయకుడు



జాషువానగర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు

పరసల పరంపర.

సంక్రాంతి సందడి సద్దుమణగక ముందే కంచరపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం ప్రాంతాల్లో పరసలు మొదలయ్యాయి. శివరాత్రి వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ పరసల సందడి కనిపిస్తుంది. మంగళవారం రామ్మూర్తి పంతులపేటలో, బుధవారం కొత్తరెడ్డి కంచరపాలెం, శనివారం 104 ఏరియా మర్రిపాలెం ప్రాంతాల్లో వేర్వేరుగా ఈ పరసలు జరగనున్నాయి.

సందడే సందడి

పరసల్లో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలు విక్రయిస్తారు. కర్జూరం, పంచదార కోడిపుంజులు, పానీపూరి, హల్వా, ఐస్‌క్రీమ్ వంటి తినుబండారాలు విక్రయిస్తారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కనులపండువగా ప్రసన్న వినాయక తీర్థం

కంచరపాలెం జాషువానగర్‌లో గ్రామాభ్యుదయ సంఘం గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు ఆధ్వర్యంలో ప్రసన్న వినాయక తీర్థమహోత్సవం కనుల పండువగా జరిగింది. మాజీ కార్పొరేటర్లు కొప్పల వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, మహిళా నాయకురాలు ఈతలపాక సుజాత, గొల్ల కంచరపాలెం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.కొండబాబు భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. పరసలో గొల్ల కంచరపాలెం, రామ్మూర్తిపంతులపేట ప్రాంతీయులు ప్రదర్శించిన సాము గరిడీలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెడ్డికంచరపాలెం, దుర్గానగర్, రామ్మూర్తి పంతులపేట, తదితర గ్రామాల సఖ్యతను చాటి చెప్పే భజన చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంఘం అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు గుమ్మిడి అచ్చిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

సందడిగా సంక్రాంతి వేడుకలు

- పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా సెట్‌ల ఏర్పాటు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పతంగులతో బాలల కేరింతలు



పల్లెలో పండగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఎన్జీజీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన సెట్



నందగిరి నగర్‌లో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల సెట్



శంకరమఠం రోడ్డులో గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

సీతంపేట: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి వేడుకలు ఉత్తర నియోజకవర్గంలో వాడవాడలా కనులపండువగా జరిగాయి. సంస్కృతీ సంప్రదాయాలకు దర్పణం పట్టేలా పలుచోట్ల సంబరాలు నిర్వహించారు. చిన్న, పెద్ద ఇంటిల్లపాది కొత్త బట్టలు ధరించి, ఆలయాలను దర్శించి పూజలు చేశారు. పిండి వంటలతో కుటుంబసమేతంగా భోజనాలు చేశారు.

- జీవీఎంసీ 44వ వార్డు నందగిరి నగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె వాతావరణం సెట్ ఆకట్టుకుంది.
- జీవీఎంసీ 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో సంక్రాంతి సంబరాలు కనులపండువగా నిర్వహించారు. పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించేలా గుడిసె, ఎద్దుల బండి, గడ్డి వాము, కొత్త ధాన్యం, వరి పంట, చెరకు గడలు, ధాన్యం పురెలు, రంగ వల్లులు, తోరణాలు, కుండలు, గుమ్మడి కాయలతో చూడముచ్చటగా సెట్ తీర్చిదిద్దారు. పరిసర ప్రాంత వాసులు సంబరాల్లో పాల్గొని ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు. వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జోరుగా గాలి పటాల విక్రయాలు

సంక్రాంతి పండగ సెలవు దినాలు కావడంతో పిల్లలు ఉత్సాహంగా గాలిపటాలు ఎగరవేశారు. శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, పాలబూత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద గాలిపటాల విక్రయాలు జోరుగా సాగాయి. క్లాత్, పేపర్, పాలిథిన్‌తో చేసిన పలు రకాల గాలిపటాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం

మర్రిపాలెం: ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పని చేసేందుకు వలంటీర్లు కావాలని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆసక్తి గల యువకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘసేవకులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలియజేశారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, ట్రాఫిక్ పోలీసులకు సహకరించేందుకు, ట్రాఫిక్ రూల్స్ ప్రచారం చేసేందుకు, కౌన్సెలింగ్ చేసేందుకు ఆసక్తిగలవారు సంప్రదించాలని సూచించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కంచరపాలెం, ధర్మానగర్, దుర్గానగర్, జ్ఞానాపురం, ఊర్వశి, కప్పరాడ, మాధవధార, మురళీనగర్, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, 104 ఏరియా, కరాస, బర్మానగర్, ఎస్ఏడీ, బుచ్చిరాజుపాలెం, విమాన్ నగర్, కాకానినగర్, ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్సాహవంతులైన వారు ముందుకు రావచ్చన్నారు. ట్రాఫిక్ పోలీసుతో కలిసి వలంటీర్‌గా పని చేయాలనుకునే వారు నేరుగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో లేదా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావును 9440796037 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యాచకులు, అనాథలకు అల్పాహారం



ధ్యానమందిరం వద్ద అల్పాహారం అందజేస్తున్న దివాకర్

తాటిచెట్లపాలెం: పైల శివతేజ ఫౌండేషన్ సభ్యులు సోమవారం అల్పాహార వితరణ చేశారు. పైల శివతేజ 10వ వర్ధంతి సందర్భంగా రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల ధ్యాన మందిరం వద్ద, రైల్వేస్టేషన్ రోడ్‌లో గల యాచకులకు, అనాథలకు టిఫిన్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్ట్ పైల దివాకర్ మాట్లాడుతూ తన కుమారుడు అకాల మరణం చెంది, పదేళ్లయిందన్నారు. అతడి జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నారా నాగేశ్వరరావు, సల్య మహారాణా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సంక్రాంతి సందర్భంగా శ్రీ యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేట కూడలిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగు రంగుల ముగ్గులు వేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముద్దాడ యల్లాజీ, ప్రధాన కార్యదర్శి బీసపు శ్రీనివాస్, సభ్యులు జోగా శ్రీను, పిల్లల మోహన్, పల్లా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

సీతంపేట: కనుమ పర్వదినం సందర్భంగా శంకర మఠం పక్కనున్న గోశాలలో గోపూజను ఘనంగా నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి గోపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. గోశాలలో ఉన్న గోవులకు పూజ చేసి, ప్రసాదంతో పాటు పొంగల్ తినిపించారు. స్వామీజీ మాట్లాడుతూ ఈ నెల 26న ఉదయం శివానంద ఆశ్రమంలో మహాలక్ష్మి అమ్మవారికి కుంభాభిషేకం, అదే రోజు సాయంత్రం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సామూహిక కనకధార అష్టోత్తర పారాయణ జరుగుతుందని తెలిపారు. శివరాత్రి సందర్భంగా శంకరమఠంలో చండీ హోమం, రుద్ర హోమం చేయనున్నట్టు వెల్లడించారు.



గోవుకు ఆహారం తినిపిస్తున్న విజయేంద్ర సరస్వతి మహా స్వామి

వివాహిత ఆత్మహత్య



ఉదయదేవి (ఫైల్)



ఘటనా స్థలంలో పోలీసులు

మర్రిపాలెం: పండగ పూట ఓ ఇంట్లో విషాదం నెలకొంది. భర్తతో స్వల్ప వివాదం నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలివి.. ఊర్వశి జంక్షన్ దరి ఇందిరానగర్-2 ప్రాంతంలో చదువుల రవికుమార్, ఉదయదేవి (35) దంపతులు నివసిస్తున్నారు. రవికుమార్ ఏసీ మెకానిక్ కాగా, ఉదయదేవి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగకు రావాలని ఉదయదేవిని పుట్టింటి వారితో పాటు ఆమె పెద్దమ్మ కూడా ఆహ్వానించారు. ఎవరింటికి ముందు వెళ్లాలనే విషయంలో భార్యాభర్తలిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రవికుమార్ ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. కేజీహెచ్‌కు తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోయింది. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్ కుమార్ నేతృత్వంలో ఎస్ఐలు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా మకరవేట

- వరదరాజస్వామిగా సింహాద్రి అప్పన్న
- విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం



ఉత్సవానికి ప్రతీకగా పూలతోటలో ఏర్పాటు చేసిన ఏనుగు,మొసలి బొమ్మలు



కొండపై నుంచి పూలతోటలోకి స్వామిని తిరువీధిగా తీసుకొస్తున్న దృశ్యం



గజవాహనంపై స్వామికి అడవివరంలో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. రెండు చేతులు జోడించి స్వామికి జేజేలు పలికారు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరణ చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించారు. రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేశారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, పవన్‌కుమారాచార్యులు, చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని కొలను వద్ద మూడుసార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి తిరిగి రావడంతో ఈఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని విశ్వసించారు.

జోన్-5 అధికారుల ఫోన్ నంబర్లు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో 40 నుంచి 63వ వార్డు వరకు 24 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధికి సంబంధించి సమాచార హక్కు చట్టం -2005 జోన్-5 కార్యాలయం నందు 4(1)(బి) ప్రకారం అధికారులు పౌర సమాచార అధికారులుగా పరిగణించబడ్డారు. జోన్ పరిధిలో సమస్యలపై సందేహాలు ఉంటే కాల్ చేయాల్సిన ఫోన్ నంబర్లు..

అధికారి	విభాగం(హోదా)	ఫోన్ నంబర్
ఆర్.జి.వి. కృష్ణ	జోనల్ కమిషనర్(జెడ్సీ) ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్. రాజు	సూపరింటెండెంట్-1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 సీఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో	99480 78507
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్(ఏఎంహెచ్‌వో)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో	81878 99199
కె.పద్మావతి	సీడీవో, ఏపీడీ ఇన్‌చార్జి యూసీడీ	89190 80201

నిరుపయోగంగా ఓపెన్ జిమ్ పరికరాలు

- జీవీఎంసీ నిధులు వృథా
- పట్టించుకోని అధికారులు

కంచరపాలెం: నిర్వహణ లోపంతో ఓపెన్ జిమ్ పరికరాలు మూలకు చేరాయి. జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, అరుంధతినగర్, కప్పరాడ, అంబేడ్కర్ ఎస్టేట్, పెదకొత్తూరు, తిక్కవానిపాలెం కాలనీ, జైప్రకాష్‌నగర్, కొండవాలు ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా జీవీఎంసీ నిధులతో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ సామగ్రి నిర్వహణ లోపంతో మూలకు చేరిందని కొండవాలు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రక్షణ లేకపోవడంతో వ్యాయామం చేసేందుకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, జిమ్ సామగ్రిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.





రాంజీ ఎస్టేట్‌లో మూలకు చేరిన ఓపెన్ జిమ్ సామగ్రి

శిల్పారామంలో జోష్

పీఎం పాలెం: సంక్రాంతి పండగ ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆది, సోమవారాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్లో జోష్ నింపాయి. సోమవారం జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. భోగి మంటలు సంక్రాంతి కాంతులు అనే నృత్య రూపకంతో కార్యక్రమం ప్రారంభం అయింది. హేమంత మంచులో సూర్యుడు.. రంగుల పుట్టిల్లు తెలుగు లోగిళ్లు.. నింగిలో హరివిల్లు నృత్యరూపకాలు అద్భుతంగా ప్రదర్శించి కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. అరకు థింసా నృత్యం హైలైట్‌గా నిలిచింది. వదినకు ఒకసారి.. నోము నోమున్నాలో.. తదితర జానపద గేయాలకు కళాకారులు హుషారుగా నృత్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సంజన, సంధ్య, కుషన్, మోదిక, మన్విత, భాషిత, వినీష, రిథం, చందు మొదలైన కళాకారులు పాల్గొనగా మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.



అలరించిన నృత్యప్రదర్శన

ఘనంగా అనంతుని గిరి ప్రదక్షిణ

పద్మనాభం: పద్మనాభంలో అనంతుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఘనంగా జరిగింది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల మీదుగా అనంతుని గిరి చుట్టు తిప్పారు. స్వామి భక్తుల నీరాజనాలు అందుకున్నారు.